



వ్రాస్తున్న కథ మధ్యలోనే ఆపి, పెన్‌కాప్ మూసి చిరాకుగా లేచాను టేబిల్ ముందునుంచి. బయటినుంచి అరుపులు వినపడుతున్నాయి. కిటికీ దగ్గరకు వెళ్ళి బయటికి చూశాను. మస్తాన్ ఇంటిముందు నిలబడి అరుస్తున్నాడు పరంధామయ్య. కిటికీ ముందే నిలబడి చూడసాగాను.

"బయటికి రారా, లోపలే దాక్కుంటావే ఆడదానిలాగా? ఇంట్లో ఉండికూడా ఆడవాళ్ళచేత లేదని అబద్ధం ఆడిస్తావే?"

రంకెలు వేస్తున్నాడు పరంధామయ్య, మస్తాన్ ఇంట్లోకి చూస్తూ. భుజంమీద ఉత్తరీయం నడుముకి కట్టుకొని ఉన్నాడు.

"ఎన్నాళ్ళు తిప్పుతావు నన్ను నీ ఇంటిచుట్టూ? మూతిమీద మీసం ఉన్న మగాడయితే బయటికి రా!" అరిచాడు గట్టిగా.

పక్కనే నాలుగు వాటాల ఇళ్ళలో ఉంటున్న పిన్నా, పెద్దా అంతా అప్పటికే గుమ్మాల దగ్గర నిలబడి చూస్తున్నారు కళ్ళప్పగించి—అరుస్తున్న పరంధామయ్యని, ఆయన శివతాండవాన్ని.

బయటికి వచ్చాడు మస్తాన్.

"ఏమిటి? మీరా? ఇప్పుడే నిద్ర లేస్తున్నాను" అన్నాడు పరంధామయ్యని చూసి, కళ్ళు నులుముకుంటూ.

మస్తాన్‌ని చూస్తూంటేనే, తెలిసిపోతుంది అబద్ధం ఆడుతున్నాడని. పాంట్, షర్ట్‌ల మీద ఎప్పుడూ పడుకోడు మస్తాన్. బట్టలు నలిగి పోతాయని. అవి తప్పితే ఆఫీసుకు వేసుకువెళ్ళేందుకు వేరే మంచి బట్టలు లేవనుకుంటాను మస్తాన్‌కి.

"ఇంట్లోనే ఉండికూడా లేడని అబద్ధం ఆడిస్తున్నావే?" ఎగిరి క్రొడ్డాడు పరంధామయ్య.

"నేను అబద్ధం ఆడించలేదు" అన్నాడు మస్తాన్.

"మీ అమ్మ అబద్ధం ఆడింది అయితే. ఏమమ్మా? కొడుకుని ఇంట్లోనే ఉంచుకుని లేడని ఎందుకు అబద్ధం ఆడావు?" అరిచాడు పరంధామయ్య, మస్తాన్ ఇంట్లోకి చూస్తూ.

చుట్టుపక్కల ఇళ్ళలోని వాళ్ళు బయటికి వచ్చి తమనే చూస్తూండటం గమనించి సిగ్గుపడ్డాడు మస్తాన్. "ఏమిటి సంగతి? దయచేసి మెల్లిగా మాట్లాడండి" అన్నాడు పరంధామయ్య చేతులు పట్టుకుని, ప్రాధేయ పూర్వకంగా.

మస్తాన్ చేతులు విదిలించికొట్టాడు పరంధామయ్య.

"సంగతేమిటో కూడా మరచిపోయ్యావా? అవును, నీ కెలా గుర్తుంటుందిలే! నేనే గుర్తుచెయ్యాలి నీకు. నా బాకీ" అన్నాడు తీక్షణంగా.

"సాయంత్రం తీర్చేస్తాను."

"కుదరదు. ఇప్పుడు....ఈ క్షణంలో ఇవ్వవలసిందే. ఎన్ని నెలలయిందో జ్ఞాపకం ఉందా తీసుకుని? ఎన్నిసార్లు నీ ఇంటిచుట్టూ తిరిగానో గుర్తుందా?"

"ఎలాగయినా సాయంత్రం తీర్చేస్తాను. మాట తప్పను."

"ఇలా ఎన్నిసార్లు నమ్మించావు నన్ను? అసలు నీకు డబ్బు ఇవ్వడం నాదే పొరపాటు. ఛీ, ఛీ!"

"సాయంత్రం దాకా ఆగి చూడండి."

"ఎన్నిసార్లు మాట తప్పనని ప్రమాణం చేసావు? అసలు నీకు సిగ్గు, విడియం, లజ్జ, చీము, నెత్తురు ఉంటేగా? మనిషి పుటక పుట్టలేదు నువ్వు."

ఒక్కమాటయినా ఎదురు చెప్పకుండా తల వంచుకుని నిలబడ్డ

మస్తాన్ని, గుమ్మం చాటున నిలబడి కొడుకుని పరంధామయ్య తిట్టే తిట్లు వింటున్న ముసలావిడనీ చూస్తే నాకు బాగా జాలివేసింది. మనిషిపుటక పుట్టలేదని కన్నతల్లి వినేటట్లుగా కొడుకుని అంటే ఆ ఇద్దరూ ఎంత బాధ పడతారు? ఏమీ చేయులేని అసహాయ స్థితి వాళ్ళది.

"పాతిక రూపాయలే గదా? నాలుగు నెలలా బాకీ తీర్చటానికి కనీసం నెలకి అయిదయినా కడుతూంటే ఈ పాటికి చాలాభాగం తీరిపోయే దిగా? ఇన్నాళ్ళూ పోనీ, పాపం అని ఊరుకున్నాను. ఏమీ చేయలేడనేగదా నీ అలుసు? ఇంక ఊరుకోను."

"తప్పకుండా సాయంత్రం సర్దుతాను. మీరు వెళ్ళండి" అన్నాడు. మస్తాన్ బ్రతిమాలుతూ.

"సాయంత్రం ఎక్కడనించి తెస్తావు?" అడిగాడు పరంధామయ్య కదలకుండా.

"ఆఫీసులో దొరుకుతుంది."

"నీ సంగతి నాకే కాదు, నీ ఆఫీసులో అందరికీ తెలుసు. పైసా కూడా అప్పు పుట్టదు నీకు అక్కడ. గట్టిగా ప్రయత్నంచేసి సాయంత్రాని కల్లా పాతిక రక్కావా సరేసరి. లేదా ఇంట్లోని సామానంతా వేలం వేయి స్తాను. చూద్దువుగాని నా తడాఖా."

"సాయంత్రం తప్పకుండా సర్దుతాను. అరియర్స్ రావలసినవి ఉన్నాయి." గొణిగాడు మస్తాన్.

"నీలాగా మాట తప్పేవాడ్ని కాను నేను. అన్నంత పనీ చేసి తీరు తాను. దీపాలు పెట్టేలోగా ఆ పాతికా ఇవ్వకపోతే."

నాకు పరంధామయ్యని చూస్తే అసహ్యం వేసింది. సందు చివర రెండంతస్తుల మేడ ఉంది. కారు ఉంది. వడ్డీ వ్యాపారంలో చాలా సంపా దించాడు! సంపాదిస్తున్నాడు. ఈ పాతిక రూపాయలు వసూలు కాకపోతే గడవదనే బాధ లేదు. మస్తాన్ బీదరికం గురించి బాగా తెలుసు ఆయనకి. ప్రతి శుక్రవారం ఇంటికి వచ్చి తన తరఫున పూజచేసే బ్రాహ్మడికి ఇచ్చే నెల జీతంలో సగం లేదు ఈ పాతిక. ఊరుకోకూడదూ? సిగ్గు లేకుండా అలా పీడిన పడి అరుస్తాడే?

పరంధామయ్య వంక చూశాను. నడుముకి కట్టుకున్న ఉత్తరీయం విప్పి, దులిపి భుజాన వేసుకున్నాడు.

"ఛీ! అసలు నువ్వు పుట్టకపోయినా బాగుండేది." గిరుక్కున వెనక్కి తిరిగి, సుడిగాలిలా వెళ్ళిపోయాడు.

ఆ అవకాశం కోసమే చూస్తున్న వాడిలా మస్తాన్ ఇంట్లోకి వెళ్ళి పోయాడు వెంటనే.

అంత సేపూ గుమ్మాల దగ్గర నిలబడి తమాషా చూస్తున్న వాళ్ళంతా కూడా లోపలకి వెళ్ళి పోయారు.

పాపం, మస్తాన్! అవమానంతో,సిగ్గుతో అన్ని మాటలూ తల వంచు కుని పడి, నిలబడ్డాడు పరంధామయ్య ముందు అపరాధిలాగా, అందరూ చూస్తూండగా. ముఖ్యంగా తల్లిముందు. నేనే అలాంటి పరిస్థితుల్లో ఉంటే? ఇంకేమయినా ఉండా? చచ్చిపోయేవాణ్ణేమో?

కిటికీ దగ్గరనుంచి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను ఆలోచిస్తూ. మస్తాన్ మాత్రం ఏం చేస్తాడు? నూట ఎనభై జీతం నెలకి. ఆర్కియాలాజికల్ డిపార్ట్ మెంట్ లో అంతకంటే ఎక్కువ దొరికే అవకాశం లేదు ఇప్పట్లో, ప్యూన్‌కి. ఆ నూట ఎనభైతో నలుగురు ఎదిగిన చెల్లెళ్ళని ఇద్దరు తమ్ము ళ్ళని, రోగంతో ఉన్న తల్లిని పోషించాలి. ఎక్కడి నుంచి తీసుకురాగలడు? తీసుకువచ్చింది ఎలా తీర్చగలడు?

తనూ అవసరం వచ్చినప్పుడు అప్పు చేస్తాడు. ఎవరిదగ్గరయినా. అసలు అప్పుచెయ్యని మనిషే ఉండడు ప్రపంచంలో. కాని, తను గడువులో తీర్చెయ్య గలడు.మస్తాన్ తీర్చలేడు. అంతే తేడా. డబ్బు చేతిలో ఉన్నా, అప్పు తీర్చబుద్ధి కాదు. తల్లికి మందులు కొనుక్కు రావాలన్పిస్తుంది. లేదా పెద్ద చెల్లెలికి ఓణీ కొనుక్కురావాలన్పిస్తుంది. ఎప్పటి కప్పుడే అలా ఖర్చులు తరుముకువచ్చి డబ్బుని తిస్తానేయి, అప్పు తీరః వ్వకుండా.

మస్తాన్ పెళ్ళికూడా చేసుకోలేదు, ముప్పైఏళ్ళు దాటుతున్నా తెలుసు —పెళ్ళి చేసుకున్నా పెళ్ళాన్ని, పుట్టబోయే పిల్లల్ని పోషించలేడు. అందుకనే పెళ్ళి చేసుకోడు—బహుశా ఎప్పటికీ.

మధ్యలో ఆపిన కథను పూర్తి చేదామని పెన్ను తెరిచాను. కాని,

పెన్ను కదలలేదు. మూడ్ పోయింది. ఛీ! వెధవ కొంప! ఫెన్ మూసేసి, కాగితాలు డ్రాయర్‌లోకి తోసేశాను విసుగ్గా.

"మూసేశావే?" అన్నది అమ్మ గదిలోకి వచ్చి, చిన్నగా నవ్వుతూ.

"వినపడలేదా ఇంత సేపూ" అన్నాను కోపంగా.

"మస్తాన్ రెండో చెల్లెలు వచ్చింది. హాల్లో ఉంది. పాతిక రూపాయలు ఉంటే ఇమ్మని అడుగుతోంది."

"లేదని చెప్పు. ఇప్పటికే నాకు పాతిక దాకా అప్పు ఉన్నాడు." అబద్ధం ఆడాను.

"ఒక్క పాతికేకదా? పాపం కష్టంలో ఉన్నారు." అమ్మది జాలి గుండె. అందుకనే అబద్ధం ఆడాను. అయినా' అమ్మవదిలేటట్లు లేదు నన్ను.

"మన దగ్గిర తీసుకుని పరంధామయ్యకి ఇస్తాడు, నోటికి భయపడి. తరువాత మనం వసూలు చేసుకోవడానికి ఎన్ని తంటాలు పడాలి? పరంధామయ్య లాగా మనం రోడ్డెక్కి అరవలేం."

"నెమ్మదిగా తీరుస్తారులేరా. పాపం! బాగా ఇబ్బందిలో ఉన్నారు. ఇప్పుడు సహాయం చేయకపోతే మరెప్పుడు చేస్తాం?"

"దానం ఇచ్చామనుకొని ఇవ్వు. తిరిగి వస్తుందని ఆశ పెట్టుకోకు. నీళ్ళు వదులుకొని ఇవ్వు" అన్నాను కోపంగా.

"తిరిగి ఇవ్వకపోతే దానం చేసిన పుణ్యమయినా వస్తుందిగా నీకు?" చిన్నగా నవ్వి, పాతిక తీసుకుని వెళ్ళిపోయింది అమ్మ.

ఇందాకటి ఆలోచన గుర్తుకు వచ్చింది నాకు. పరంధామయ్య ఆ పాతిక తిరిగి రాకపోతే దివాలా తీయడు. అయినా, దానికోసం తాపత్రయ పడుతున్నాడు ఏలాగయినా వసూలు చేసుకోవాలని. నాకు తిరిగి పాతిక రాకపోతే నేనూ దివాలా తీయను. పెళ్ళి కాలేదు నాకు. పిల్లలు లేరు. ఆ పాతిక ఎలాగయినా ఖర్చవుతుంది నా దగ్గిర ఉంటే, పార్క్‌లేన్ లోని షిరాజ్‌కి వెళితే బిల్లు పాతికకి తక్కువ కాదు నాకు ఎప్పుడూ. కాని, ఆ పాతిక ఊరికే ఇవ్వడానికి మనసు ఒప్పదు. అలాగే ఆ పాతిక వదులుకోవడానికి మనసు ఒప్పదు బహుశా పరంధామయ్యకు.

సాయంత్రం ఆఫీస్‌నుంచి షిరాజ్‌కు వెళ్ళాను దగ్గిరే కనుక. బేరర్

ప్లేట్‌లో బిల్లు తీసుకు వచ్చాడు అరగంట తరువాత. బిల్లువంక చూశాను. పాతిక! డబ్బుఇస్తూంటే గుర్తుకు వచ్చింది పొద్దున్న సంగతి. మస్తాన్ బహుశా ఆ పాతికా ఇచ్చేసి ఉంటాడు పరంధామయ్యకి ఈ పాటికి. నేను సగం వ్రాసి ఆపిన కథ సంగతి గుర్తుకు వచ్చింది. ఇంటికి వెళ్ళాను వెంటనే,

బూట్లు విప్పి, టేబిల్ ముందు కూర్చుని, డ్రాయర్ లాగి కథవ్రాసిన కాగితాలు బయటికి తీశాను. కాఫీ గ్లాసుతో వచ్చింది అమ్మ, నాలుగువాక్యాలు వ్రాయగానే.

"పాతిక ఇచ్చాడా మస్తాన్ పరంధామయ్యకి?" అడిగాను కాఫీ గ్లాసు అందుకుని.

"ఇవ్వలేదనుకుంటాను?" అన్నది అమ్మ.

"ఏం? ఏం చేశాడు ఆ పాతిక?" అడిగాను కాఫీ తాగి, ఖాళీగ్లాసు టేబిల్‌మీద పెట్టి.

"పాపం, కారుకింద పడ్డాడుట."

"ఏలాగా?" అడిగాను. నమ్మలేకపోయాను.

"అవునుట. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వస్తూండగా జరిగిందిట.

"మరి ఆ పాతిక? పరంధామయ్య రాలేదా ఇంటిమీదకి మళ్ళీ?"

"వచ్చాడు ఇందాక. మస్తాన్ అమ్మ చెప్పింది మస్తాన్ కారుకింద పడటం. ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయారు."

"పాపం" అన్నాను నేను, అమ్మ సంతృప్తికోసం.

"గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్పించారు వెళ్ళి చూసి రారాదూ?" అడిగింది అమ్మ. "ఇది పూర్తి చేసెయ్యాలి. తరువాత వెళతాను" అన్నాను నేను, టేబిల్‌మీద కాగితాల వంక చేత్తో చూపిస్తూ.

ఖాళీ కాఫీగ్లాసు తీసుకు వెళ్ళిపోయింది అమ్మ. కథ మీదికి వెళ్ళలేదు దృష్టి. అమ్మ చెప్పిన విషయాలమీదే తిరుగుతూంది మనసు.

మళ్ళీ వచ్చింది అమ్మ. కాఫీగ్లాసు తోమి, బోర్లించి వచ్చి ఉంటుం దనుకున్నాను. "మిగతా నాలుగిళ్ళలోవాళ్ళూ వెళ్ళారు మస్తాన్‌ని చూడ టానికి. నువ్వు వెళ్ళకపోతే బాగుండదు" అన్నది అమ్మ. "రేపు ఆఫీసుకి వెళ్ళేటప్పుడు వెళతాను."

కొన్ని క్షణాలాగి అంది అమ్మ "బాగా బీదవాడు. అమ్మకునేందుకు ఖరీదయిన వస్తువులు కూడా ఏమీలేవు వాళ్ళింట్లో అంతా ఎవరికి తోచినది వాళ్ళు ఇస్తున్నారు."

నేనేం మాట్లాడలేదు. అమ్మ చెప్పబోయే దేమిటో నాకు తెలుసు.

"మనం కూడా ఏమైనా ఇస్తే బాగుంటుంది. పుణ్యం సంగతి ఎలా ఉన్నా, ముందర చావు బ్రతుకుల మధ్య ఉన్నవాణ్ణి బ్రతికించిన వాళ్ళమవుతాం" అన్నది నెమ్మదిగా.

సన్నగా ఏడుపులు వినపడుతున్నాయి మస్తాన్ ఇంట్లోనించి, లీలగా.

"ఇందాకా మస్తాన్ రెండో చెల్లెలు వచ్చి చెప్పింది. ఆస్పత్రికి వెళ్ళి చూసి వచ్చిందిట. రక్తం చాలా కారిపోయిందిట. కొత్త రక్తం ఎక్కించా లన్నారుట డాక్టర్లు. బీదవాళ్ళకే అన్ని పాట్లూనూ."

"ఏదో నీకు తోచిన సహాయం చెయ్యి అన్నాను నేను, జేబులోంచి పర్సు తీసి ఇచ్చి. అమ్మ పర్సులోంచి డబ్బు తీసుకుంది.

నెమ్మదిగా మనస్సు కథ మీదకు మళ్ళించాను. రాత్రి పడుకోబోయే ముందు పర్సు తెరిచి చూశాను. ఏభై రూపాయలు తక్కువ ఉన్నాయి.

అమ్మది మరీ మెత్తని మనస్సు.

○ ○ ○

మర్నాడు ఉదయం భోజనంచేసి ఆఫీసుకు వెళుతూంటే గుర్తుచేసింది. అమ్మ, తప్పకుండా ఆస్పత్రిలో ఉన్న మస్తాన్‌ని చూడమని.

ఆస్పత్రి దారిలోనే కాబట్టి లోపలికి వెళ్ళాను. ఆ సమయంలో లోపలికి వెళ్ళనివ్వరు. నాకు తెలిసినవాళ్ళు ఉండడంవల్ల లోపలికి వెళ్ళగలిగాను. ఇంటికి వెళ్ళగానే అడుగుతుంది అమ్మ, మస్తాన్‌ని చూశావా, లేదా అని. చూడలేదంటే కోపం వస్తుంది అమ్మకు.

"మొదట జనరల్ వార్డులోనే అడ్మిట్ చేశారు అతన్ని. స్పెషల్ వార్డులోకి మార్పించారు నిన్న రాత్రి అతనికి తెలిసినవాళ్ళు వచ్చి" చెప్పింది నర్స్. తేలికగానే కనుక్కోగలిగాను మస్తాన్ ఉన్న గది. గుండెల దాకా తెల్లటి దుప్పటి కప్పుకుని పడుకుని వున్నాడు బెడ్‌లో. కప్పువంక చూస్తున్నాడు. పక్కనే ఉన్న తెల్లరంగు వేసిన ఇనప టేబిల్ మీద బ్రెడ్,

పళ్ళు, మందుసీసాలు ఉన్నాయి. నన్ను గుర్తించి నీరసంగా నవ్వాడు మస్తాన్. కూర్చోమన్నట్లుగా సైగచేశాడు.

"ఎలా ఉంది?" అడిగాను, రాని చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

"బలహీనంగా ఉంది. కాలు దగ్గిర నొప్పిగా ఉంది. ఇక్కడ కూడా." తలకు వున్న బాండేజ్ వంక చూపించాడు.

"ఎలా జరిగింది?" అడిగాను.

సమాధానం చెప్పలేదు మస్తాన్, నేను అడిగిన ప్రశ్నకి.

"చాలా థాంక్స్ త్వరలోనే మీరు ఇచ్చిన పాతికా, మరో ఏభై తీర్చేస్తాను" అన్నాడు చేతులు ఎత్తి నమస్కారం చేస్తూ. "ఫర్వాలేదు. కష్టంలో ఉన్నప్పుడు మరో మనిషికి సహాయం చేయకపోతే ఇంకెప్పుడు చేస్తాము?" అన్నాను నేను.

కృతజ్ఞతగా చూశాడు.

చేతిగడియారం వంక చూసుకున్నాను.

"ఆఫీస్ టైమ్ అయినట్లుంది" అన్నది మస్తాన్ పక్కన కూర్చుని ఉన్న మొదటి చెల్లెలు.

"అవును. వీలుంటే సాయంత్రం వస్తాను మళ్ళీ" అని బయటికి నడిచాను.

బయటికి వచ్చాక గుర్తుకు వచ్చాయి అమ్మ ఉదయం చెప్పిన మాటలు, మస్తాన్‌కి ఎవరో రక్తం దానం చేశారన్న సంగతి. "రక్తం ఎలా వచ్చింది?" అడిగాను. నర్స్‌ని, "మీరు ఇప్పుడు చూసిన పేషెంట్ విషయమా అడిగేది?"

"అవును ఎవరో రక్తం ఇచ్చారుట?"

"ఆ రూమ్‌లోనే ఉన్నాడు. చూస్తారా?" ఎదురుగా ఉన్న వంక చూపించింది నర్స్.

నర్స్ వెళ్ళిపోగానే ఎదురుగా ఉన్న గదిలోకి వెళ్ళాను. బెడ్ ఖాళీగా ఉంది. బెడ్ ప్రక్కన ఉన్న కుర్చీలో కూర్చుని ఉన్నాడు పరంధామయ్య.

"అతను ఎక్కడికి వెళ్ళాడు?" అడిగాను, ఖాళీగా ఉన్న బెడ్‌వంక చూస్తూ.

"ఎవరు?" అడిగాడు పరంధామయ్య.

'నువ్వు ఇక్కడికి కూడా వచ్చావా' అన్నట్లుగా చూశాను ఆయన వంక.

"మస్తాన్‌కి రక్తదానం చేసినతను."

"నేనే" అన్నాడు పరంధామయ్య, బల్లమీద ఉన్న ఆపిల్ పండు అందుకుంటూ. తెల్లబోయి చూశాను, నమ్మలేనట్లుగా. నిజానికి నమ్మలేక పోయాను పరంధామయ్య మాటలు.

"అవును. మస్తాన్‌కి రక్తం దానం చేసింది నేనే. మా ఇద్దరి బ్లడ్ గ్రూప్స్ అదృష్టవశాత్తు ఒకటే అయ్యాయి."

నా ముఖంలోని భావాలని చదివి మళ్ళీ అన్నాడు: "ఏం? నమ్మలేక పోతున్నారా? మస్తాన్‌ని జనరల్ వార్డ్‌లోంచి స్పెషల్ వార్డ్‌లోకి మార్పించింది కూడా నేనే!"

ఆపిల్‌పండు కొరుక్కు తింటున్న పరంధామయ్యని అడిగాను నేను: "దేనికి మస్తాన్‌కి రక్తదానం చేశారు?"

"తప్పా?"

అలాంటి ప్రశ్న వస్తుందనుకోలేదు, సమాధానంగా, "తప్పని నేను అనలేదు."

"మస్తాన్ చచ్చిపోతే నా పాతిక పోతుందని కాదు. మస్తాన్ బతకడానికి. ఇప్పటికి మస్తాన్ నాకు బాకీ ఉన్నదానికి ఎనిమిది రెట్లు పైగానే ఖర్చు పెట్టి ఉంటాను" అని ఆగి అన్నాడు మళ్ళీ."

"నేను రక్తదానం చేస్తానని ఊహించలేదా మీరు?"

"లేదు" అన్నాను నెమ్మదిగా.

"బహుశా నిన్న పొద్దున్న మస్తాన్ ఇంటి ముందు నిలబడి అలా అరిచినందువల్ల నన్ను దుర్మార్గుడుగా, మస్తాన్ శత్రువుగా, ఓ పరమ

రాక్షసుడుగా భావిస్తారని తెలుసు నాకు, చాలామంది. కాని అలా గొడవ చెయ్యక పోతే నా డబ్బు నాకు రాదు. అలా గొడవ చేయడం కేవలం నా వృత్తికి సంబంధించిన విషయం—మనసుకు కాదు. నాకూ మనసనేది, దయ, జాలి అనేవి ఉన్నాయి."

సౌమ్యంగా చెపుతున్నా, తీక్షణంగా, ఉద్రేకం తొంగి చూస్తున్నాయి పరంధామయ్య మాటల్లో.

"మస్తాన్ లాంటి బీదవాళ్ళు అప్పు అడిగితే లేదనలేను. అప్పివ్వడం, వడ్డీ, తీసుకోవడం నా వృత్తి. అలా ఒకసారి గొడవ చేస్తే మాటి మాటికీ వచ్చి నన్ను అప్పు అడగడు. అంతేకాకుండా, మీలాంటి వాళ్ళకి అది హెచ్చరిక లాగా కూడా ఉంటుంది.

నిన్న ఉదయం జరిగినదంతా కేవలం నా వృత్తికి సంబంధించినది. నిన్న రాత్రి జరిగినదంతా నా మనసుకు, జాలి, దయలకు సంబంధించినది. నా వృత్తి ద్వారానే పరిచయం ఉన్న చాలామందికి నా మనసు అర్థంకాదు. మస్తాన్ కారు కింద పడ్డాడని తెలియగానే వెళ్ళి ఎక్కడ చేర్పించారో కను క్కున్నాను సహాయం చేయడానికి. నేనూ మానవత్వం ఉన్న మనిషినే. వడ్డీ వ్యాపారస్థుడికీ, కసాయివాడికి కూడా మనసనేది ఉంటుంది. కాని, దాన్ని చూడలేరు చాలా మంది."

మౌనంగా వింటూ ఉండిపోయాను.

"మీరే చెప్పండి, ఆపదలో ఉన్న సాటి మనిషిని ఆదుకోలేకపోతే మనం మనుషుల కింద జమ కాము."

విచిత్రం. 'ఛీ! అసలు నువ్వు పుట్టక పోయినా బాగుండేది' అన్న పరంధామయ్య, మస్తాన్‌ని చావునించి తప్పించి, జీవితం ఇచ్చాడు తన రక్తంతో.

అప్పటివాకా డబ్బుగురించే తెలిసిన నాకు మనసు, జాలి, దయల గురించి తెలిసి వచ్చింది. మళ్ళీ అమ్మ మరో ఏభై మస్తాన్ చెల్లెలికి ఇచ్చినా ఏమీ బాధ పడలేదు నేను.

క్రమంగా మస్తాన్ కోలుకుని డిశ్చార్జ్ అయ్యాడు ఆస్పత్రిలోంచి ఉద్యోగం పోయింది మస్తాన్‌కి, ఆక్సిడెంట్‌లో కుడికాలు తీసెయ్యడం వల్ల మస్తాన్‌కి ఉద్యోగం ఇప్పించాడు పరంధామయ్య తనకు తెలిసిన ఒక చిట్ ఫండ్ కంపెనీలో, పలుకుబడినంతా ఉపయోగించి.

ఒకరోజు సాయంత్రం వ్రాసుకుంటూంటే కిటికీ దగ్గర మాటలు వినపడ్డాయి. లేచి వెళ్ళి చూశాను.

"తప్పకుండా సాయంత్రం లోపల సర్దుతాను. ఈ ఒక్కసారికి దయ ఉంచండి." బ్రతిమాలుతున్నాడు మస్తాన్.

"వీల్లేదు. వెంటనే ఆ ఏభై ఇవ్వకపోతే...." అరుస్తున్నాడు పరంధామయ్య కోపంగా.

(ఆంధ్రప్రభ వారపత్రిక, 1-14-1971 సంచిక)